పకడ్బందీగా పది పరీక్షలు: కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పదో తరగతి పరీక్షలకు హాజరవు తున్న విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించి సజావుగా, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ఆర్‌సిఎం సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద గాలి, వెలుతురు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను ఉన్నవి, లేనిది చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీ చేయకుండా ఇన్విజిలేటర్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వేసవి ఉష్ణోగ్రత స్థాయి అధికంగా ఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందితో పాటు ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ముందస్తుగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రం వద్ద భద్రత పరంగా 144 సెక్షన్ అమలు, తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు నిర్దేశిత సమయంలోగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలు దేరేటట్లు చూడాలని ఆయన అన్నారు. జిల్లాలో 220 పాఠశాలలకు చెందిన 10,455 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 10,367 మంది విద్యార్థులు రెగ్యులర్ కాగా, 88 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. జిల్లా లోని 67 పరీక్షా కేంద్రాలకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది శాఖాధికారులు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం చర్చివీధిలో గల డీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షలు జరిగే తీరును అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట విద్యా శాఖాధికారులు ఉన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాలతోపాటు గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, నీలానగరం, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి పరీక్షకు 734 మంది హాజరు కావలసి ఉన్నప్పటికీ బిటివాడ 1, వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఎంఈఓ-1 డి.గౌర్నాయుడు తెలిపారు. గిరిజాల భవాని ప్రసాద్, త్రిపురాణ పృథ్వి దివ్యాంగుల విద్యార్థులు సైబర్ సహాయంతో పరీక్ష రాసినట్లు ఎంఈఓ తెలిపారు. వీరఘట్టం జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాలను ఎంపీడీవో బి.వెంకటరమణ, గంగంపేట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ-1 డి.గౌర్నాయుడు పరిశీలించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - కొమరాడ: ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ జై.నారాయణస్వామి అన్నారు. మండలంలో మొత్తం ఎనిమిది స్కూల్ నుండి 469 విద్యార్థులు పరీక్ష హాజరయ్యారని, మండలంలో మొత్తం మూడు పరీక్ష కేంద్రాలు కాగా కొమరాడ జడ్పీహెచ్ స్కూల్‌లో 134 మంది విద్యార్థులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల కళాశాల 145 విద్యార్థులకు గాను 144 మంది పరీక్ష రాసినట్లు తెలిపారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్సీ పాఠశాలలో 190 విద్యార్థులకు గాను 188 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాలకు వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

విశాలాంధ్ర - కురుపాం: బియ్యాలవలస పంచాయతీ దురిబిలి పరిసరాలలో అక్రమంగా నాటుసారా తయారీ కోసం సిద్ధం చేస్తున్న బెల్లం ఊటలను ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి ధ్వంసం చేసినట్లు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. అక్రమంగా నాటుసారా తయారు, అమ్మకం చట్టవ్యతిరేకమైన పని అని, ఎవరైనా అమ్మకాలు, నాటుసారా తయారీ చేసినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది సంగమేసు, ట్రైనింగ్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

రెండు పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండ లంలో గల రెండు పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. చినమేరంగి పరీక్ష కేంద్రంలో తోటపల్లి చినమేరంగి, పెదమేరంగి, పిప్పలభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు చిన మేరంగి కెజిబివి పెదమేరంగి కూడలిలో గల సత్య కైలాస్ ఉన్నత పాఠశాల, తిరుమల సాయి ఉన్నత పాఠశాలల నుండి 247 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా జి.గణేశ్వరరావు, డిపార్ట్మెంటల్ అధికారిగా టి. పండు నియమితులయ్యారు. అలాగే జియ్యమ్మ వలస పరీక్షా కేంద్రంలో పరీక్షలు జరుగుతున్న తీరును మండల తహాశీల్దార్ రెడ్డి ఫకీరు, మండల విద్యాశాఖ అధికారి 2 ముదిలి శ్రీనివాసరావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎటువంటి సంఘటనలు తలెత్తకుండా చినమేరంగి ఎస్ఐ పి. అనీష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సకాలంలో వినతులు పరిష్కరించాలి

పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఐటీడీఏలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 54 మంది గిరిజనులు వినతి పత్రాలు సమర్పించారు. భామిని మండలం బొడ్డగూడ గ్రామానికి చెందిన బిడ్డిక సింగన్ని కిరాణా షాపునకు లోన్ మంజూరు చేయాలని, సీతంపేట మండలం నిమ్మలవలస గ్రామానికి చెందిన బిడ్డిక అప్పారావు చేపల చెరువు మంజూరు చేయాలని, ఇసవరాయిగూడ గ్రామానికి చెందిన సవర ఎల్లయ్య తమ గ్రామానికి వరద గోడ మంజూరు చేయాలని తదితర వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, పీహెచ్ఓ వెంకట గణేష్, డిఈ సింహాచలం, డిప్యూటీ డీఈవో కుమార్, పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీడీ శ్రీహరిరావు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, ఇతర సెక్టోరల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారానికి 90 గంటలు పని ఎవర్ని ఉద్ధరించడానికి...?

విశాలాంధ్ర - బెలగాం: వారానికి 90 గంటలు పని ఎవరిని ఉద్ధరించడానికి రోజుకు 12 నుండి 15 గంటలు పని చేస్తే మన ఆర్థిక వ్యవస్థ పది లక్షల కోట్ల డాలర్లకు పెరుగుతుందని వ్యాపారవేత్తలు పని గట్టుకుని ప్రచారం చేయడం ఎవరి కోసం అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు వి.ఇందిరా, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్ ప్రశ్నించారు. పార్వతీపురం బెలగాం సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్‌లో వార మాట్లాడారు. ఎల్ అండ్ టి చైర్మన్ ఎస్-ఎస్ సుబ్రహ్మణ్యం ప్రధానమంత్రి మోడీ లాంటి వారు వారానికి 100 గంటలు పని చేస్తున్నారని ఉద్యోగులు, కార్మికులు వారానికి 90 గంటలైనా పని చేయాలని ఆదివారం నాడు సెలవు ఎందుకు మీ భార్యలను చూస్తూ ఇంట్లో కూర్చోవడానికా అని కార్మిక వర్గాన్ని హేళన చేస్తూ మాట్లాడడం తగదన్నారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కూడా ఈయన మాటలను సమర్థించారన్నారు. కేరళకు చెందిన అన్న సబిష్టి యన్ అనే యువకుడు చార్టడ్ అకౌం టెంట్ బహుళ జాతి కంపెనీల ఒత్తిడి తట్టుకోలేక మరణించాడని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ చట్టం 1948 ప్రకారం రోజువారి పని గంటలు గరిష్టంగా 9 గంటలు వారంలో గరిష్టంగా 48 గంటలు ప్రతి ఐదు గంటలకు అరగంట విరామం ఖచ్చితంగా తీసుకోవాలని, ఓవర్ టైం అయితే దీనికి అదనంగా చెల్లింపులు ఉండాలని, షాప్స్‌అండ్ ఎస్టాబ్లిష్మెంట్ చట్ట ప్రకారం రోజువారి పనిగంటలు 8 నుండి 10 గంటలు వారంలో 40 గంటలకు పరిమితం ఓటితో కలిపి 50 నుండి 60 గంటల లోబడే ఉండాలి తప్పనిసరిగా విరామం ప్రతి ఐదు గంటలకు ఒకసారి ఇవ్వాలని ఇది ప్రస్తుతం ఉన్న చట్టం కాగా లేబర్ కోడ్ పేరుతో పై చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చేసి పనిగంటలు 12 గంటల వరకు ఉండొచ్చని చెప్పడం తగదన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఐఎఫ్టియు విద్యార్థి సంఘ నాయకులు మరియు జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించరూ...

విశాలాంధ్ర - బలిజిపేట: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని వెంటనే పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రానికి బొబ్బిలి నుండి రాజాం నుండి అదే విధంగా నారాయణపురం మీదుగా పార్వతీపురం నుండి ఎక్కువగా బస్సులు, లారీలు, ప్రైవేటు వాహనములు అధికంగా వస్తూ ఉన్నవి ప్రతిరోజు మండల కేంద్రంలో వాహనాలు రద్దీగా ప్రయాణం చేయడంతో ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు విస్తరణ చేసినప్పటికీ ఇరువైపులా కిరాణా షాపులు, హోటల్స్, షాప్ యజమానులు రోడ్లు ముందుకు వచ్చి బోర్డులు ఉంచడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవుతోందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన యువకుడిపై సెటిలర్స్ కుటుంబం దాడి

విశాలాంధ్ర - సాలూరు: మండలంలో తోణాం పంచాయతీ మద్దినవలసకు చెందిన కూనేటి లక్ష్మణరావుపై అదే గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనేతరులు ఓరుగంటి మస్తానరావు కుటుంబీకులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు అందజేసిన వివరాల ప్రకారం గిరిజనుడైన లక్ష్మణరావుకి, గిరిజనేతరుడైన మస్తానరావుకి మధ్య పొలం గట్టు వద్ద సమస్య తలెత్తింది. మాటామాట పెరిగి తగాదా ఏర్పడింది. ఈ తగాదాలో మస్తానరావు కుటుంబీకులు ఒంటరిగా ఉన్న లక్ష్మణరావును అసభ్యకర పదజాలంతో దూషిస్తూ విచక్షణా రహితంగా కొట్టారని బాధితుడు ఆరోపించాడు. విషయం తెలుసుకున్న కొంతమంది స్థానిక గిరిజనులు ఘటనాస్థలానికి చేరుకొని లక్ష్మణరావు కాపాడారు. అనంతరం సాలూరు రూరల్ పోలీసులకు బాధితుడు లక్ష్మణరావు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై పోలీసులు సకాలంలో స్పందించడం లేదని సోమవారం జిల్లా ఎస్పీ గ్రీవెన్స్‌కి వెళ్లి గిరిజన సంఘాలు ఫిర్యాదు చేశారు. సాలూరు పోలీసులతో చరవాణిలో మాట్లాడి ఎందుకు కేసు నమోదు చేయలేదో అడిగి తెలుసుకున్నారు. దీంతో స్థానిక పోలీసులు గ్రామానికి చేరుకొని ఫిర్యాదుదారుడ్ని కలిసి విచారణ చేపట్టారు.

రాయితీపై మొక్కలు సరఫరా

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో సీబిల్లి పెద్దవలస గ్రామంలో కోకో పంటలో కొమ్మ కత్తిరింపులు, బీన్స్ క్వాలిటీపై ఉద్యాన శాఖ అధికారిణి ప్రత్యూష భాను శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొత్తగా వేసుకోదలచిన రైతులకు రాయితీపై మొక్కలు సరఫరా చేయబడతాయని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ పెంట వేణు రైతులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా చూడండి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: పదవ తరగతి పరీక్షలలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాల్సిన బాధ్యత ఇన్విజిలేటర్లదేనని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, తలారిసింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించిన కలెక్టర్ మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలని సూచించారు. ప్రవేశ ద్వారం వద్ద ముందుగానే ఎలక్ట్రానిక్ డివైజెస్, స్లిప్పులు లేవని నిర్ధారణ చేసుకుని మాత్రమే లోపలకి ప్రవేశ పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల వద్ద త్రాగు నీరు, ప్రాథమిక చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని, టాయిలెట్లు, లైటింగ్, ఫ్యాన్లు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం 11,466 మంది రెగ్యులర్, 28 మంది ప్రైవేటు కలిపి 11,494 మంది హాజరు కావలసి ఉండగా 11,354 మంది రెగ్యులర్, 23 మంది ప్రైవేటు కలిపి 11,377 మంది హాజరు కాగా 112 మంది రెగ్యులర్ ఐదుగురు ప్రైవేటు అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని కలెక్టర్ వివరించారు. 71 పరీక్షా కేంద్రాలకు 71 మంది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను, ఎనిమిది మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్ స్కూల్ విధానంలో పరీక్షకు 74 మందికి గాను 65 మంది హాజరయ్యారని, తొమ్మిది మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎటువంటి సంఘటనలు జరగ లేదని, మాస్ కాపీయింగ్ జరగలేదని డిఇఓ తెలిపారు.

గిరిజనేతరుల సమగ్ర నివేదిక ఇవ్వాలి

సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

విశాలాంధ్ర - కొయ్యూరు: జాతీయ రహదారి 516 ఈ నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజనేతరుల వివరాలపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని పాడేరు సబ్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ అన్నారు. సోమవారం మండలంలో పి మాకవరం, రామరాజుపాలెం, వలసంపేట గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులతో సమావేశం అయ్యారు. ముందుగా పి.మాకవరంలో ఉత్తర వాహినికి పుణ్యస్నానాలు ఆచరిం చేందుకు నదికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన కూడా సింహాచలం సడ్డా సత్యవతి, పోడి నూకాలమ్మ సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం రామరాజు పాలెం గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోయిన భూమిపై కురుజు రమణ, బత్తిన సోంబాబు మధ్య తలెత్తిన భూ వివాదంపై పూర్తి ఆధారాలతో ఇరువురు ఈ నెల 22న పాడేరు కార్యాలయంలో జరిగే కోర్టుకు హాజరుకావాలని సూచించారు. అనంతరం వలసంపేట గ్రామంలో గిరిజనేత్రుడైన వంచాడ సత్తిబాబుకు చెందిన భూమి జాతీయ రహదారిలో కోల్పోయినా నష్టపరిహారం రాలేదని ఫిర్యాదు చేయడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన గిరిజనేతర్ల వివరాలు పూర్తి సమాచారంతో వచ్చే నెల 2 నాటికి తమకు సమగ్ర నివేదిక అందించాలని డిప్యూటీ తహాశీల్దార్ కుమార్ స్వామిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కుమారస్వామి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్న దొర, సీనియర్ అసిస్టెంట్ పెంటారావు, విలేజ్ రెవెన్యూ అధికారి గంగాభవాని, సర్వేయర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్, ఉపాధ్యాయులను బలిపశువులను చేస్తున్న ఐటీడీఏ అధికారులు

విశాలాంధ్ర - జీకే వీధి: ఐటీడీఏ అధికారులు తమ తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలల వార్డెన్, ఉపాధ్యా యులను బలిపశువులను చేస్తున్నారని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు అన్నారు. గత కొంత కాలంగా ఆశ్రమ పాఠశాలలో పిల్లలు చనిపోవడం బాధాకరమని, పిల్లల బంధువులను సంతృప్తి పరిచేందుకు వార్డెన్, ఉపాధ్యాయులను విధుల నుండి కొన్ని రోజులు సస్పెండ్ చేయడం తప్ప అసలు చనిపోకుండా ఉండేందుకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ఆశ్రమ పాఠశాలలో వరుస సంఘటనలు జరుగుతున్న సమయంలో వార్డెన్, ఉపాధ్యాయులను మాత్రమే ఆ సంఘటనలకు బాధ్యులను చేయడం తప్పన్నారు. వారి పై అధికారు లైన ఎటిడబ్ల్యూ, డిడి, పిఓలకు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. పాఠశాలల్లో నీటి సదుపాయం, ప్రహరీ, వాచ్ మెన్‌లు, హెల్త్ అసిస్టెంట్లు నియామకం తదితరాలు ఏమీ చేపట్టడం లేదన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న సంక్షేమ పాఠశాలలు సమస్యలకు నిలయంగా మారాయని, అధికారులకు ఈ సమస్యలన్నీ తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. నెలకు ప్రతి వార్డెన్ దగ్గర నుండి పై అధికారులకు ఒక పిల్లవాడు నుండి రూ.55 వెళ్తున్నట్లు సమాచారం ఉందని, సంక్షేమ పాఠశాలలో సమస్యలను అధికారులు పరిష్కరించకపోతే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మే 4 నుంచి మోదకొండమ్మ అమ్మవారి జాతర

విశాలాంధ్ర - హుకుంపేట: మన్య ప్రజల ఆరాధ్య దైవమైన మోదకొండమ్మ అమ్మవారి జాతరను మే 4,5,6 తేదీల్లో ఘనంగా నిర్వహించాలని స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మోదకొండమ్మ ఆలయ వద్ద గ్రామ పెద్దలు, నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువ కులతో సమావేశం ఏర్పాటు చేసి జాతర కమిటీని ఎన్నుకున్నారు. జాతరకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పాంగి బొంజుబాబు (అనిల్), ఉపాధ్యక్షులుగా శోభ సాయిరాం, ప్రధాన కార్యదర్శిగా సంపంగి శేఖర్, కార్యదర్శిగా వండాలి విశ్వనాథం, ట్రెజరర్‌గా బొడ్డేటి శివ, గౌరవాధ్యక్షులుగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, సర్పంచ్ వెంకట పూర్ణిమ, ఎంపీటీసీ కొమ్మ రమ, మాజీ జెడ్పిటిసి కొర్ర కాసులమ్మ, సాగరి రాజారావు మాస్టర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్ర మంలో వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, వర్తక సంఘం నాయకులు, ఉద్యోగస్తులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సాయంపై హర్షం

విశాలాంధ్ర - జీకే వీధి: కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 10 నెలలు కావస్తున్న సందర్భంలో గిరిజన ఆదివాసి జాతులకు పెద్దపీట వేసింది. అందులో భాగంగా వారి సొంతింటి కలలు నెరవేర్చేందుకు పెద్దపీట వేసిందని గూడెం మండల టిడిపి, బిజెపి, జనసేన మండల అధ్యక్షులు ముక్కలి రమేష్ కాకూరి శేఖర్, కోయ్యం బాలరాజు తెలిపారు. ఆదిమ జాతి ఆదివాసులు (పివిటిజి)లకు అదనంగా లక్ష రూపాయలు, ఎస్టీలకు 75000 రూపాయలు సహాయం చేసి కూటమి ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేసిందని కొనియడారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రజల కోసం చేసింది సున్నా అని అన్నారు. రాబోయే లోకల్ ఎన్నికలలో తమ సత్తా చూపుతామని తెలిపారు.

పాముకాటుకు ముగ్గురు అస్వస్థత

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలో మిరియాల సేకరణలో గిరిజన రైతులు పాముకాట్లు బారిన పడుతున్నారు. దుంబ్రిగుడ పీహెచ్సీలో ముగ్గురు గిరిజనులు పాముకాటుకు గురయ్యి ఆసుపత్రిని ఆశ్రయించారు. మిరియాల సేకరించే సమయంలో పాము కాటుకు గురైన గిరిజనులు అస్వస్థతకు గురయ్యి ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. స్థానిక పీహెచ్సీలో రంగిలిసింగి, ముసిరి గొందిగుడ, శీలంగొంది గ్రామాలకు చెందిన గిరిజనుల మిరియాల పంట సేకరణలో పాముకాటుకు గురయ్యారు. వీరిని స్థానిక వైద్యాధికారి రాంబాబు వైద్య పరీక్షలను నిర్వహించారు. ప్రమాదకర పాములు కాకపోవడంతో ప్రాణపాయ స్థితి నుంచి బయటపడ్డారని ఆయన తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - అనంతగిరి: కేంద్రం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని బీజేపీ అరకు నియోజకవర్గ కన్వీనర్ శెట్టి రాజు సూచించారు. బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 28 పథకాలపై ఆయన వివరించారు. ఉచిత రేషన్ బియ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లు, వీధి దీపాలు, చెత్త సేకరణ, గ్రామీణ ఉపాధి హామీ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అని దిన దినాభివృద్ధి చేస్తూ దేశాన్ని అభివృద్ధి పథంలో మోడీ నడిపిస్తున్నారన్నారు.

బొర్ర జంక్షన్‌లో సీసీ కెమేరాలు ఏర్పాటు

విశాలాంధ్ర - అనంతగిరి: టోకూరు పంచాయతీ ములియగుడ (బొర్ర జంక్షన్)లో అరుకు సిఐ హిమగిరి, అనంతగిరి ఎస్సై శ్రీనివాసరావు సూచనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు టోకూరు పంచాయతీ సర్పంచ్ కిల్లో మోస్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి బొర్ర జంక్షన్ ములియగుడ నిఘా నీడలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సారా దొన్ను, వార్డు సభ్యులు కిల్లో స్వామి, కొర్రా అప్పన్న, బాడం మద్దు, కిల్లో అప్పలస్వామి, రామ, కొర్రా సోమన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి విశాఖ జిల్లా జడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్రను కోరినట్టు స్థానిక ఎంపీటీసీ సన్యాసి దొర, చిన్నారావు, సర్పంచులు రాంబాబు, రామకృష్ణ చెప్పారు. సోమవారం వారు విశాఖపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి మండల సమస్యలు వివరించారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించి గిరిజన ప్రాంత అభివృద్ధికి హామీ ఇచ్చినట్లు వారు స్పష్టం చేశారు. జడ్పీ చైర్మన్‌ను కలిసిన వారిలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సురభంగా రామకృష్ణ, సర్పంచ్‌లు రాంబాబు, ఎంపీటీసీలు జి.సన్యాసిదొర, కె.చిన్నారావు ఉన్నారు.

పది పరీక్షలు ప్రశాంతం

విశాలాంధ్ర - కొయ్యూరు: మండల కేంద్రంలో ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి రాంబాబు తెలిపారు. బాయ్స్ వన్, ఏపీ ఆర్ పాఠశాల , హై స్కూల్ మూడు పరీక్ష కేంద్రాల్లో 667 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా అందులో ముగ్గురు విద్యార్థులు హాజరు కాలేదని దీంతో 664 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు పరీక్షా సెంటర్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని సెంటర్ల వద్ద మంచినీటి సౌకర్యం, మెడికల్ సిబ్బందిని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలను, గాంధీనగరం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను జిల్లా సంయుక్త కలెక్టర్ డా. అభిషేక్ గౌడ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయా కేంద్రాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా పరీక్షార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో అమలు జరుగుతున్న 144 సెక్షన్, జెరాక్స్ షాపులు మూసివేత పరిశీలించారు. ఎట్టి పరిస్థితులలో కాపీయింగ్ జరగకూడదని, విద్యార్థులు స్వశక్తితో చదివి ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

కిరాణా షాపుల్లో ప్రభుత్వ పంచదార ప్యాకెట్లు

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండలో కిరాణా షాపులు ముందు దర్శనమిస్తున్న సివిల్ సప్లై పంచదార కవర్లు దర్శనమివ్వడం తీవ్ర విస్మయానికి గురి చేసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు పేదలకు సివిల్ సప్లై ద్వారా ఇస్తున్న సరుకులు విక్రయాలు, కొనుగోలు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. అయితే ఇక్కడ మాత్రం ఈ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడి వ్యాపారులు ప్రవర్తన కనిపిస్తుందని పలువురునాయకులు అంటున్నారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - చింతూరు: ఆంధ్రప్రదేశ్ ఆశ్రమ పాఠశాల శానిటేషన్ ఆయా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధ సంఘం) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఐటీడీఏ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల, కళాశాలలో పనిచేస్తున్న పారిశుధ్య వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలని, మూడు నెలలు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏవోకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య వర్కర్లు సుజాత, విజయ, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటుచేసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మడం జరుగుతుందని ఏపీ సిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు తెలిపారు. ఈ స్టాల్లో కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, పండ్లు, నూనె, బెల్లం మొదలగు ఉత్పత్తులను అమ్మకాల కోసం పెట్టడం జరుగుతుందన్నారు. ఎన్ఎఫ్ఏ తిరుపతి మాట్లాడుతూ ఈ స్టాల్ వలన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన రైతులకు మార్కెట్ సదుపాయం కలుగుతుందని, రైతులు మంచి ధరకు అమ్ముకోవడానికి ఇది ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇక్కడ అమ్మకాలు చేసేందుకు వస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ భాను, ఎంటి శ్రీరామ్, ఎల్1- తవుడు, ఎల్2- లక్ష్మి, గంగరాజు, ఐసిఆర్పీలు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

విశాలాంధ్ర - బలిజిపేట: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి 1 సామల సింహాచలం తెలిపారు. వంతరాం పరీక్షా కేంద్రంలో 168 మంది, బలిజిపేట మండల కేంద్రంలో ఎ కేంద్రంలో 150 మంది, బి కేంద్రంలో 138 మంది మొత్తం 456 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఆయన తెలిపారు. మూడు పరీక్షా కేంద్రాల్లో నూరు శాతం విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మంచినీరు, ఫ్యాన్స్, ఫర్నిచర్, ప్రాథమిక వైద్య సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

కురుపాం: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. దర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 249కి 248 హాజరు కాగా ఒకరు గైర్హాజర్ అయ్యారు. ఎపి మోడల్ స్కూల్ కేంద్రంలో 211కి 208 హాజరు కాగా ముగ్గురు గైర్హాజరు అయ్యారు. మొత్తం నలుగురు విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు గైర్హాజర్ అయినట్లు ఎంఈఓ ఎస్.సత్యనారాయణ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెంటర్‌లో 162 మంది విద్యార్థులకి 162 మంది హాజరయ్యారని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. డిఈఓ ఎన్.తిరుపతి నాయుడు ఎపి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరు పరిశీలించారు. వివరాలను ఎంఈఓ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ పదోతరగతి పరీక్షా కేంద్రంలో సోమవారం నుండి ప్రారంభమైన పరీక్షలకు 163 మంది పరీక్షలు రాసినట్లు ఎంఇఓ 2 వెంకటరమణ తెలిపారు. 164 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరు అయినట్లు తెలిపారు. తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని విఆర్ పురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం తెలుగు పరీక్షకు 135 విద్యార్థులకు ఒక విద్యార్థి గైర్హాజరవ్వగా సున్నవారిగూడెం ఆశ్రమ పాఠశాలలో మొత్తం 122 మంది విద్యార్థులకు గాను 121 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ బాబురావు ఓ ప్రకటనలో తెలిపారు.

చింతపల్లి : మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు తొలి రోజు (సోమవారం) ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు చింతపల్లిలో 4 పరీక్షా కేంద్రాలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు.. ఈ 4 పరీక్ష కేంద్రాల్లో 685 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 665 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 20 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. ఈ మేరకు సి ఎ హైస్కూల్లో 180 మంది విద్యార్థులకు గాను.175 .మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు..5 మంది విద్యార్థులు హాజరు కాలేదు. అదేవిధంగా బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 170 మంది కి గాను 160 .మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. 10మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. అలాగే బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల-2 లో 155 మంది విద్యార్థులు గాను 150 మంది పరీక్షలకు హాజరు కాగా 5 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు.ఇలా ఉండగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులకు గాను, 180 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ వి.అప్పారావు తెలిపారు. దీంతో తొలిరోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

ఎటపాక: సోమవారం పదోవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎటపాక మండలంలో రెండు కేంద్రాల్లో గౌరీ దేవి పేట, కే ఎన్ పురం కేంద్రాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓలు సరియం రాజులు తెలిపారు. తెలుగు పరీక్షకు మండల వ్యాప్తంగా 299 మంది విద్యార్థులకు గాను 296మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ముగ్గురు గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటపాక ఎస్సై, అప్పలరాజు , సీఐ కన్నప్ప రాజు ఆద్వర్యంలో పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

21న సీతంపేట వైటిసిలో జాబ్ మేళా

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన సీతంపేట వైటీసీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, అసెంబ్లీ ట్రైనీ, ప్రొడక్షన్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్ ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉద్యోగాలకు పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్లలోపు గల యువతీ యువకులు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో 6 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 6 కంపెనీల్లో 250 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.16,000/- నుండి రూ.20,000/- వరకు వేతనం ఇవ్వబడుతుందని, ఆసక్తి గల వారు వివరాలకు 7032060773 -7993795796-9154662567 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతీ శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవం

విశాలాంధ్ర - పార్వతీపురం: ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ దినోత్సవంగా పాటించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గృహ నిర్మాణం, వేసవి వేడిమి, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్) తగితర అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం గృహ నిర్మాణ కార్యక్రమాలు సామూహికంగా ప్రారంభించాలన్నారు. ప్రత్యేక అధికారులు మండల స్థాయిలో పర్యవేక్షణ చేసి గృహ నిర్మాణ దినోత్సవం పాటించి జిల్లాకు కేటాయించిన 7 వేల లక్ష్యాలను జూన్ నాటికి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ ఎస్ లో రెవిన్యూ సంబంధిత అంశాలు ఎక్కువగా వస్తున్నాయని, వాటి పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన చెప్పారు. గ్రామ పంచాయతీ అధికారులు ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని ఆయన స్పష్టం చేశారు. భవన నిర్మాణ అనుమతులు లేకుండా నిర్మాణాలు జరగరాదని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలకు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారిని ఆదేశించారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్రా (సాసా) కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కలెక్టర్ అన్నారు. అక్టోబర్ 2వ తేదీ తరువాత ఎక్కడ అపారిశుధ్యత ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ

అధికారి కె.హేమలత, గృహ నిర్మాణ సంస్థ ఇన్చార్జి డా.పి.ధర్మ చంద్రారెడ్డి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి చంద్ర శేఖర్, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పి.లక్ష్మణరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా. టి.కనకదుర్గ, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర రాజు తదితర జిల్లాఅధికారులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో అలసత్వం వద్దు

విశాలాంధ్ర - పార్వతీపురం: వినతుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో 106 మంది అర్జీదారుల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారితో కలిసి స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ కు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కారించాలన్నారు. ప్రతి ధరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారాన్ని అందించాలని తెలిపారు. ధరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కారం కావాలని స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ విజ్ఞప్తులపై నిర్లక్ష్యం పనికిరాదని తెలిపారు. మండల స్థాయిలో సమస్యలను అక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఇంచార్జి జేసీ కె.హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు కె.రాబర్ట్ పాల్,బి.శ్యామల, డా.ఎస్.మన్మధరావు, ఓ.ప్రభాకరరావు, కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు,డ్వామా, ఐసీడీఎస్ పీడీలు కె.రామచంద్రరావు, డా. టి.కనకదుర్గ, బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్,వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహనరావు, డీఎస్డీఓ కె.సాయికృష్ణ చైతన్య తదితర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీడిపిక్కల మార్కెట్ యార్డులో జీడి పరిశ్రమ పెట్టొద్దు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: కాలుష్యాన్ని పెంచి ప్రజల ప్రాణాలకు ముప్పు చేకూర్చే జీడి పరిశ్రమను పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేయడాన్ని పట్టణ పౌర సంక్షేమ సంఘం తీవ్రంగా వ్యతిరేకించింది. సోమవారం రాయగడ రోడ్డు చివరనగల మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేయుచున్న జీడిపిక్క పరిశ్రమ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం పట్టణ కార్యదర్శి పాకాల సన్యాసిరావు మాట్లాడుతూ పరిశ్రమలు నివాస ప్రాంతాలకు దూరంగా స్థాపించి, ఉపాధి అవకాశాలను చేకూర్చే బాధ్యత ప్రభుత్వం పై ఉందని, దానికి విరుద్ధంగా పార్వతీపురం ప్రభుత్వ అధికార యంత్రాంగం జీడిపిక్క పరిశ్రమను పట్టణ నడిబొడ్డున నిర్మించడం వలన దాని ద్వారా వచ్చే పొగ, తేమ, వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. పరిశ్రమలకు అభివృద్ధి వ్యతిరేకులం కామని, పట్టణ కేంద్రంలో పరిశ్రమ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఒకటి, రెండు, మూడు, నాలుగు వార్డుల పిల్లలకు, వృద్ధులకు, గర్భిణీలకు ప్రాణాంతకరమైన వ్యాధులు సంభవించే పరిస్థితి ఉందని అన్నారు. శ్రీకాకుళంలో గల జీడి పరిశ్రమలు ఉన్న ప్రాంతాలను ఉదాహరణగా వివరించారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలకు దగ్గరగా పరిశ్రమ పెట్టాలని, జిల్లాలో

పరిశ్రమలు అవసరమైనప్పటికీ అవి జనావాసముల మధ్యలో వద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే పరిశ్రమ ఏర్పాటు కొరకు నీటి బోర్లు తీయడం, గ్రావెల్స్, ఇసుక, కరెంటు పోల్లు నిర్మాణం చేపట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు ఎస్. ఉమామహేశ్వరరావు, బి.సూరిబాబు, డివైఎఫ్ఐ నాయకులు వి.రాజశేఖర్ మరియు కార్మికులు, గృహిణీలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

26 నుండి దారాలమ్మ తల్లి జాతర

విశాలాంధ్ర - సీలేరు: జీకేవీధి మండలం దారకొండలో శ్రీశ్రీశ్రీదారాలమ్మ తల్లి జాతర మహోత్సవం 2025 మార్చి 26 నుండి 29 వరకు అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు గారు అమ్మవారి సన్నిధిలో గిడ్డి ఈశ్వరికి సాలువతో సన్మానం చేశారు. ఈశ్వరి మాట్లాడుతూ అమ్మవారిని నమ్ముకున్నవారి కోరికలు తీర్చే తల్లి అని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని, అమ్మవారి దయతో అందరికీ శుభం కలగాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే ఈ నాలుగు రోజులు జరిగే అన్నసంతర్పణ కార్యక్రమానికి 50,000 రూపాయలు విరాళంగా ఇచ్చారు. జాతర సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తామని, నాలుగు రోజులపాటు జానపద నృత్యాలతో పాటు బుర్రకథలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈవో సాంబశివరావు తెలిపారు. ఈ జాతరకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ

కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎంపీటీసీ పోతురాజు గోవిందరావు, వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనందరావు, దారకొండ ఎంపీటీసీ మాడి రామన్న, పోతురాజు కృష్ణారావు, తగ్గి బంగారాజు, శోభ జగన్, కెకె.పడాల్,సుందర్ రావు, మన్మథరావు, దాసు, వెంకటేష్, బర్సయ్య, మాడుగుల చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై రైతుల ఆసక్తి కనబరచాలి

విశాలాంధ్ర - చింతపల్లి: తేనెటీగల పెంపకంపై రైతులు ఆసక్తి కనబరచాలని, స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏ డి ఆర్ డాక్టర్ ఆళ్ళ అప్పలస్వామి అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏడు రోజులు పాటు "శాస్త్రీయ తేనెటీగల పెంపకం" పై రైతులకు ఉచిత శిక్షణ కార్యక్రమమును సోమవారం ఆయన ప్రారంభించారు. జాతీయ తేనెటీగల బోర్డు సౌజన్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన 25 రైతులకు ఈనెల 17 నుండి 24 తేదీ వరకు ఏడు రోజులు పాటు "శాస్త్రీయ తేనెటీగ ల పెంపకం" పై రైతులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తేనె సేకరణ పై మెలకువలు తెలుసుకోవాలని అన్నారు. మానవులకు మేలు చేయు కీటకాలలో అతి ముఖ్యమైనవి తేనెటీగలని, పంటలలో పర పరాగ సంపర్కం జరిగి అధిక దిగుబడులు రావటానికి తేనెటీగలు ఉపయోగపడతాయని అన్నారు. వీటి నుండి తేనె మాత్రమే కాకుండా ఇతర ముఖ్యమైన ఉప ఉత్పత్తులకు కూడా పండు వచ్చినని ఆయన అన్నారు వీటిలో మైనము, పుప్పొడి, తదితర వి లభ్యమవుతాయన్నారు.. మధురమైన తేనే మానవునికి సమతుల్య ఆహారానికి అందించడమే కాకుండా మిగిలిన ఉత్పత్తులు ఇతర పరిశ్రమలు స్థాపన కూడా ఇవి ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త ,సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.ఎన్ సందీప్ నాయక్ , పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తేనెటీగల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతుల్లో పలువురు రైతులు పాల్గొన్నారు. ఇలా ఉండగా ఈ శిక్షణ తరగతులకు హాజరైన అల్లూరి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారిణి పి రోహిణి ని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి దుస్సాలులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాడేరు స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ వి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో సీడీఎంఏ ఆదేశాలు పాటించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, కొళాయి పన్నులు వసూళ్లలో సీడీఎంఏ ఆర్డీఎంఏ ఆదేశాలను సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పురపాలక సంఘంలోని పన్నుల వసూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ఇంకా 15 రోజులు మాత్రమే సమయం ఉన్న దృష్ట్యా అడ్మిన్లు ఉదయం 8.00 గంటలకు ముందుగానే సచివాలయాలకు చేరుకుని కలెక్షన్స్ టీమ్‌ని, మెప్మా ఆర్పిలను కూడా కలుపుకొని ఫీల్డ్‌లోకి వెళ్ళాలన్నారు. ప్రతి సచివాలయం నుండి ఫీల్డ్ ఫోటోలు ఈ గ్రూపులో పోస్ట్ చేయాలని, ఎవరైనా కలెక్షన్ టీమ్ సభ్యులు హాజరు కాకపోతే మీ రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కు గ్రూప్ ద్వారా మెసేజ్ చేయాలన్నారు.

పాత్రుని కోనేరుపై ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని జగన్నాధపురం ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పాత్రుని కోనేరుపై ఆక్రమణలను తక్షణమే తొలగించి ఆ కోనేరు అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు దృష్టిసారించాలని ఆ ప్రాంత ప్రజలు, అవార్డు పాలకవర్గ సభ్యులు రణభేరి శివకుమార్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రుని కోనేరుకి నాలుగు వైపులా గట్టుపై కొన్ని ఇల్లు మాత్రమే ఉండేవని ఇప్పుడు కొత్తగా మరికొంతమంది ఆక్రమించి చెరువు మార్గాన్ని కప్పి వేయడం జరుగుతుందని ఈ విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసు కెళ్లినప్పటికీ చర్యలు శూన్యమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఈ కోనేరుపై దృష్టిసారించి ఆక్రమణలు తొలగించి ఈ పాత్రుని కోనేరు ప్రాంతంలో పార్కు అభివృద్ధి చేసి పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని కోరారు.

ప్రతి సోమవారం "మీ కోసం" : ఎంపీడీవో

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రతి శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమస్యల పరిష్కార వేదిక స్పందన మాదిరిగానే చింతపల్లి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం సమస్యల పరిష్కార వేదిక మీ కోసం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యూ ఎస్ వి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని వివిధ పంచాయతీల నుంచి పలు సమస్యలపై అర్జీలు అందాయనీ, వాటిని త్వరలోనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులకు వాటిని పంపించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సమస్యలపై వినతుల స్వీకరణ

విశాలాంధ్ర - అనంతగిరి: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ జీ ఆర్ ఎస్. మీ కోసం కార్యక్రమం జరిగిందని ఎంపిడిఓ ఏవివి కుమార్ తెలిపారు. రెవెన్యూ డిపార్ట్మెంట్‌కి సంబంధించి 2 టోకూరు గ్రామ పంచాయతీకి సంబంధించి కరెంట్ మీటర్ ఎల్ పి సి కొరకు ఒకటి వినతి పత్రం వచ్చింది మొత్తంగా మూడు గ్రీవెన్స్ లో ప్రజల నుండి విన్నతులు వచ్చాయని పై ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. అదేవిదంగా మీ కోసం కార్యక్రమం ప్రతి సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తాహశిల్దార్ మాణిక్యం మండల పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫారం పాండ్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న ఫారం పాండ్స్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం కౌన్సిల్ మెంబర్ అల్లు లావణ్య కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండలంలోని గెడ్డ తిరువాడ, బిజెపురం గ్రామాల్లో పర్యటించి పారం పాండ్స్ పనులను పరిశీలించారు. రైతులు ఈ ఫారం పాండ్స్ ద్వారా ఎంతో లబ్ది పొందుతారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతులు బంకురు వెంకటినాయుడు, తెర్లి రామినాయుడు, ఆర్నిపల్లి త్రినాథ నాయుడు, బిజె పురం రైతులు మరడాన అన్నపూర్ణమ్మ, సావిత్రమ్మ, మరిశర్ల శివున్నాయుడు, మండల సత్యం నాయుడు, కలివిండి జయలక్ష్మిలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారంతా ఎండలు ఎక్కువగా ఉన్న కారణంగా ఒక పూట మాత్రమే పనులు చేయగలమని, వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలని, పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలపై రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడి రెండు మూడు రోజుల్లోనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఎపిఓ తులసి దాస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా అప్పలకొండ

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో గల చినమేరంగి గ్రామానికి చెందిన రాగాల అప్పలకొండ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం హైదరాబాదులోని అబిడ్స్ లో గల రీగల్ హోటల్ లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్ సమక్షంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు అనంతరం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షులు కె. విజయ్ కుమార్ (వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ హోల్డర్) హాజరై ప్రసంగించారు.

అవినీతి నిరోధం వేధింపులు అంటరానితనం నిషేధం భ్రూణ హత్యలు నిర్మూలన గృహ నిర్బంధం నుండి రక్షణ భూకబ్జాలు అరికట్టడం మత్తు పానీయాలు డ్రగ్స్ గంజాయి వంటివి అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు. ఈ సందర్భంగా ఎపి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాగాల అప్పలకొండను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఇచ్చిన బాధ్యతలను కచ్చితంగా నెరవేరుస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ గుంప హనుమ గౌడ్, వైస్ చైర్మన్ డాక్టర్ జూపల్లి తిరుమలరావు, తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ పదో తరగతి పరీక్షలు

విద్యుత్, ఫ్యాన్లు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డ విద్యార్థులు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండల కేంద్రంలో పదోతరగతి పరీక్షలు అసౌకర్యాల నడుమ జరుగుతున్నాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ఆశ్రమ పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ్యాలేదు. బాలికల ఆశ్రమ పాఠశాలలో 10 గదు లలో సీసీ కెమెరా లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేటాయించినపరీక్ష కేంద్రంలోని గదులు చెత్త చెదారాలతో నిండిపోయాయి. ఆచెత్త చెదారల నడుమ విద్యార్థులు కూర్చొని పరీక్షలు రాయాల్సి వచ్చింది. .సంబంధిత పాఠశాల యాజమాన్యం శుభ్రం చేయించకుండా వదిలేయడంతో విద్యార్థుల అసౌకార్యనికి గురయ్యారు. కేటాయించిన గదుల్లో విద్యుత్, ఫ్యాన్ సౌకర్యాలు లేక ఉక్కపోతతోనే పరీక్షలను రాస్తున్నామని విద్యార్థులు తెలిపారు. ముందస్తుగానే పరీక్ష కేంద్రాల్లో సౌకర్యల కల్పనపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించి ఇక్కడి కేంద్రల్లో సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. విద్యార్థులకు పరీక్షల కేంద్రాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టి కేంద్రాలకు పంపించారు.



తనను విమర్శించే అర్హత జెడ్పీటీసీకి లేదు

వైసీపీ మండల అధ్యక్షుడు రవి

విశాలాంధ్ర - చింతపల్లి: తనను విమర్శించే హక్కు జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్యకు లేదని వైకాపా మండల అధ్యక్షుడు మోరి రవి అన్నారు. పార్టీని కించపరిచే విధంగా బహిరంగ ప్రకటనలు చేసిన మోరి రవిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని బాలయ్య, గణబాబులు చేసిన ఆరోపణపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలలో బాలయ్య ఏ పార్టీకి మద్దతుగా తిరిగారో జనాలకి తెలుసన్నారు. సాక్షాత్తు అప్పటి పార్టీ అభ్యర్థికే దొరికిపోయిన ఆయన గోడమీద పిల్లి వంటి వారని, పార్టీ మీద అభిమానంతో తెలిసో తెలియక ప్రజలు జెడ్పిటిసిగా గెలిపించారు తప్ప నాలా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతం కోసం కష్టపడ్డ కార్యకర్తవు కావన్నారు. తమరి వంటి గోడమీద పిల్లులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ నాలాంటి కార్యకర్తలు వైకాపా జెండా నీడలో చిరస్థాయిగా ఉంటారన్నారు. నేను నీలా పదవుల కోసం వెంపర్లాడే వ్యక్తినైతే, నాకు దక్కవలసిన జడ్పిటిసి పదవి మీకు కేటాయించినప్పుడే అడ్డుపడేవాడిననీ, కానీ నేను అడ్డుపడలేదంటే పార్టీ అధిష్టానం అదేశాలకు కట్టుబడి, కష్టపడి పనిచేసే కార్యకర్తను కాబట్టే అన్నారు. ప్రస్తుతం తమరు అనుభవిస్తున్న జడ్పిటిసి పదవి నా దయాదాక్షిణ్యాలవల్ల తమరు అనుభవిస్తున్నారన్న విషయం చింతపల్లి మండల వైకాపా నాయకులు, శ్రేణులందరికీ తెలుసన్నారు. నేను మీలా అందితే జుట్టు, లేకపోతే కాళ్లు పట్టుకునే రకం కాదన్నారు. తాను నిస్వార్థంగా పార్టీ కోసం నిరంతరం పనిచేసే కార్యకర్తనని ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు తెలుసన్నారు. తమరు ఎటువంటి వారో ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పూర్తిగా తెలుసన్నారు. స్వలాభం కోసం ఎంతకయినా దిగజారే తత్వం తమదనీ అందరికి తెలుసన్నారు. తాను వైకాపా మండల అధ్యక్షునిగా దాదాపు 8 ఏళ్లుగా కష్టపడి పని చేశాననీ, అదే విధంగా నేటికీ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నానన్నారు. నీతి నిజాయితీగా పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలు సంక్షేమం కోసం పని చేస్తున్నానని మీకు తప్ప పార్టీ లోని ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. ఇతరుల మెప్పు కోసం ప్రకటన లు చేసే తమ వంటి వారికి సమా ధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయాలకు బద్దుడనై నా ప్రాణం ఉన్నంతవరకు వైకాపా కోసం పనిచేస్తాననీ, పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ శక్తి వంచన లేకుండా కష్ట పడతాను తప్ప తమ వంటి గోడ మీద పిల్లులు చేసే ప్రకటన లకు భయపడేది లేదని తెలుసుకోవాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌ను కలిసిన దేవీపట్నం సర్పంచ్ రాజమణి

విశాలాంధ్ర - దేవీపట్నం: దేవీపట్నం మండలంలో పోలవరం

ప్రాజెక్టులో ముంపునకు గురైన 44 గ్రామాల నిర్వాసితుల సమస్యలను ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయంలో సోమవారం పోలవరం అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ గారిని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజమణి దేవీపట్నం మండల తెలుగు యువత అధ్యక్షులు లంక హరిచంద్రుడు దేవీపట్నం గ్రామ నిర్వాసితులు కలిసి సమస్యలను వివరించారు. దేవీపట్నం గ్రామానికి సంబంధించి కోర్టులో ఉన్న9.ఎకరాలు నిరసితులకు అప్పగించి గృహ నిర్మాణం చేపట్టాలని 2013 భూ సేకరణ చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని గిరిజన గిరిజనేతర రైతుల భూమికి నష్ట పరిహారం అలాగే భూమికి భూమి సమస్యలను పరిష్కారం చేయాలని 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులకు అర్హుల జాబితాలో చేర్చాలని పునరావస కాలనీలో స్మశాన వాటికలు మండలంలో సుమారు 1200 మంది అర్హులైనప్పటికీ చిన్నచిన్న కారణాలు చూపిస్తూ అనర్హుల్గా అధికారులు చూపిస్తున్నారని తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు సమస్య పై స్పందించిన ఆయన దేవీపట్నం 9 ఎకరాలు కోర్టులో రిట్ వేసామని త్వరలోనే నిర్వాసితుల కు గృహ నిర్మాణం చేపడతామని జిల్లా కలెక్టర్ వారు పునరవాస కాలనీ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని కార్యక్రమం దేవిపట్నం గ్రామ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర - బెలగాం: సాలూరు మం డలం తోణాం పంచాయతీ మద్దెనవలస గ్రామంలో ఎస్టీ జాతాపు కులమునకు చెందిన కునేటి లక్ష్మణ్ ఆయన భార్య ఝాన్సీలపై తమ ఇంటి వద్ద వెళ్లి అగ్ర కులస్తులైన విరాళ్ళ నాగేశ్వరరావు, విరాళ్ల మోహనరావు, ఓరుగంటి మస్తానురావు, ఓరుగంటి కొండల రావు, సిహెచ్ శ్రీనివాసరావు, ఓరుగంటి నాయుడు, ఓరుగంటి రత్తయ్య కుటుంబ సభ్యులతో భౌతికంగా దాడికి పాల్పడ్డారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని ఐక్య ఆదివాసి గిరిజన సంఘాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి తక్షణమే వారి కేసు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి గౌరవాధ్యక్షులు నిమ్మక జయరాజు, కొండగొర్రి ఉదయ్ కుమార్, అన్నారావు, చంద్రశేఖర్, రామకృష్ణ, సీతారాం, పుష్పారావు, సిహెచ్ బింగు, మండల గిరిధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో తప్పులను సవరణ చేసుకోవాలి

విశాలాంధ్ర - బలిజిపేట: 2024 రబీ సీజన్లో ఈ పంటలో నమోదైన పంటల వివరాలను విధిగా రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని గ్రామ సభలు నిర్వహించి వివరాలను చదివి రైతులకు వినిపించాలని వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ నాయుడు అన్నారు. అంపావల్లి సచివాల యంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈపంట నమో దులో ఏవైనా చిన్న చిన్న తప్పులు దొర్లినట్లయితే సరి చేసుకోవడానికి ఇదే చివరి అవకాశం అని కావున ఈ పంటలో నమోదైన రైతుల వివరాలను గ్రామ సభలలో చదివి వినిపించడమే కాకుండా రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించాలని సూచించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వ్రాతపూర్వక ఫిర్యాదులను స్వీకరించి వాటిని సవరణ చేయాలన్నారు. సవరణలు పూర్తి అయిన తర్వాత తుది జాబితా రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శితం అవుతుందన్నారు.

పాత పద్ధతిలో బస్సులు పునరుద్దించాలి: ఎంపీడీఓకు వినతి

విశాలాంధ్ర - పాచిపెంట: మండల కేంద్రమైన పాచిపెంటకు సాలూరు ఆర్టీసీ డిపో నుండి యధావిధిగా బస్సులు నడపాలని పాచిపెంట ఎంపీటీసీ దండి ఏడుకొండలరావు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో ఫిర్యాదు చేశారు.

బస్సులు నడవకపోవడం వలన ప్రజా రవాణా కుంటుపడుతుందని అన్నారు. పాచిపెంట సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు దండి ఏడుకొండలు ప్రజాసమస్యల వేదిక లో సోమవారం ఎంపీడీవో బి.వి.జె. పాత్రోకి ఫిర్యాదు చేశారు. గతంలో సాలూరు ఆర్టీసీ డిపో నుండి సాలూరు కేసలి సాలూరు పూడి సాలూరు వేటగాని వలస సాలూరు పాచిపెంటకు ఆర్టీసీ బస్సులు నడిపే వారిని గత దశాబ్దాలు కాలంగా పాచిపెంట మండలం కి ఆర్టీసీ సమస్త బస్సులు నడపడం లేదని ఆయన తెలిపారు. అదేవిధంగా కేవలం విద్యార్థులు బస్సు పాస్ కలిగిన వారికి మాత్రమే ఒకే ఒక బస్సును ఉదయం రెండు సార్లు సాయంత్రం రెండు సార్లు నడిపే వారిని ఫిర్యాదుల పేర్కొన్నారు . నైట్ హాల్ట్ బస్సు కూడా వేయాలని ఆయన కోరారు. బస్సులు రాకపోవడం వల్ల విద్యార్థులు ప్రయాణికులు ఆటోలు ఆశ్రయించవలసి వస్తుందని అన్నారు

దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు సాయంత్రం అయిందంటే ఆటోలు కూడా దొరకకపోవడం వల్ల ఏమని ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంపిడిఓ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే ఉన్నత అధికారులు స్థానిక మంత్రివర్యులు పాచిపెంట మండల కేంద్రానికి బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పాచిపెంట మండలంలో 28 గ్రామపంచాయతీలు ఉన్నాయని ఈ మండలం లో అధిక సంఖ్యలో గిరిజనులు ఉన్నారని ఆయన తెలిపారు.

మండల విద్యాశాఖ అధికారి సస్పెన్షన్

విశాలాంధ్ర - పాచిపెంట: పాచిపెంట మండలం మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసిన పి.జోగారావు సస్పెన్షన్ అయినట్టు సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. వివరాల్లోకి వెళ్ళగా పాచిపెంట మండలంలో మోసూరు గ్రామములో ప్రభుత్వ పాఠశాల భవన స్థలమును ప్రైవేటు వ్యక్తి ఆక్రమణ చేసినప్పటికీ సంబంధిత మండల విద్యాశాఖ అధికారి పట్టించుకోవడంతో ఉన్నత అధికారులుకు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు సంబంధిత జిల్లా ఉప విద్యాశాఖ అధికారి దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించడంతో సంబంధిత మండల విద్యాశాఖ అధికారి పి.జోగారావును సస్పెన్షన్ చేసినట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ (కాకినాడ) సంబంధిత అధికారులకు మెయిల్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. సస్పెన్షన్ వేటు గత నాలుగు రోజుల క్రితం సంబంధిత అధికారికి మెయిల్ ద్వారా పంపినట్లు తెలిసింది.